# నిద్రలేని రాత్రులు

-చింతా జగన్నాధరావు

అదృష్టవశాత్తు రాఘవగారికి కొడుకులు, కూతుళ్లు దేశంలోనే వున్నారు. ఆయన్ని హాస్పిటల్‌లో చేర్పించారన్న వార్త రాగానే పొరుగు రాష్ట్రాల్లో వున్న పెద్దవాడు, చిన్నవాడు రెక్కలు కట్టుకుని వాలారు. ఉన్న ఊరే కనుక ఇద్దరమ్మాయిలు భర్తలతోపాటు అప్పటికే హాస్పిటల్‌కు వచ్చారు. పెద్దవాడు తల్లిని అడిగాడు. "ఏమిటమ్మా ఈ ఘోరం! ఇదంతా ఎలా జరిగిందమ్మా?" వివరాలు అడిగాడు ఆస్పత్రికి వెళ్లగానే.

"అంతా నా ఖర్మ. నేను చెప్తూనే ఉన్నాను సాయంత్రం స్కూటర్ నడపకండి, కారు తీయండి అని. వింటేనాకదా. 'ఒక్కడినేకదా... ఓ గంటలో వచ్చేయనూ' అంటూ బయలుదేరారు. సరిగ్గా పది నిముషాలకు ఫోన్ వచ్చింది 'మీవారికి ఆక్సిడెంట్ అయిందని, రోడ్‌మీద స్పృహ లేకుండా పడి వున్నారని, స్కూటర్ కొద్ది దూరంలో డివైడర్‌ని గుద్దుకుంధని చెప్పారు. నాకు కాళ్లూ చేతులు ఆడలేదు. ఎదురింటి సీతారాంగారి పిల్లలను తోడు తీసుకుని వెళ్లాను. ఫోన్ చేసిన కుర్రాడు ఏ తల్లి కన్నబిడ్డోగానీ దేవుడల్లే రక్షించాడు. నాన్నగారి సెల్‌లోంచే నాకు, ఆఫీసువాళ్లకి ఈ వార్త చేరవేసి, అంబులెన్స్‌ను పిలిచి అది వచ్చేదాకా ఉండి ఎక్కించి మరీ వెళ్లాడు. ఎంత బుద్ధిమంతుడో. నాన్నగారి జేబులోవున్న క్యాష్, క్రెడిట్ కార్డులు అన్నీ జాగ్రత్తచేసి మరీ నాకు అప్పగించాడు. నా కంగారులో అతనెవరూ అన్న విషయం తెలుసుకోలేదు."

"ఇప్పుడు నాన్నగారి పరిస్థితి ఎలా ఉంది?'' చిన్నవాడు అడిగాడు.

"వెంటనే ఆస్పత్రికి తీసుకురావడంవల్ల ప్రాణ గండం తప్పింది. మోచేతులు చెక్కుకుపోవడం తప్ప వంటిపైన గాయాలేమీ లేవు. కానీ తలకు తగిలిన దెబ్బే ప్రమాదకరమైనది. బ్రైన్‌లో బ్లడ్ క్లాట్ అయిందంటున్నారు. అత్యవసరంగా ఆపరేషన్ చేయాలిట'' అంది తల్లి.

***

రిపోర్టులు వచ్చాయి. స్పెషలిస్టులు, సర్జన్లు వచ్చారు. రాఘవగారికి జయప్రదంగా ఆపరేషన్ అయింది.

రాఘవగారికి తెలివి వచ్చింది. అంది కళ్లల్లో సంతోషం.

వారి ఆందోళనకు తెరపడింది. ఆఫీస్ స్టాఫ్ పుష్పగుచ్ఛాలు, స్నేహితుల పరామర్శలు సరేసరి.

కార్పొరేట్ వైద్యం ఖర్చు అంతా అబ్బాయిలు, తండ్రికోసం ఎప్పుడో తీసుకున్న ఇన్సూరెన్స్ పాలసీలు భరించాయి.

వారంరోజుల్లో రాఘవగారు హాస్పిటల్ నుండి డిశ్చార్జ్ అయ్యారు. ఆయన పూర్తిగా కోలుకోవడానికి కనీసం మూడునెలలు పడుతుందని, మందులు రెగ్యులర్‌గా వాడాలని డాక్టర్లు చెప్పారు.

***

ఇంట్లో పండుగ వాతావరణం నెలకొంది.

చాలా ఏళ్ల తరువాత పిల్లలందరూ ఒక దగ్గర చేరి ఆనందంగా గడుపుతున్నందుకు రాఘవగారికి చాలా తృప్తిగా, సంతోషంగా ఉంది. కాళ్లూ చేతులు ఇంకా స్వాధీనంలోకి రాలేదు. అయినా ఆయన మొహంలో ఆనందం ఛాయలు తాండవిస్తున్నాయి.

చిన్నవాడిని చెల్లెళ్లు ఆట పట్టిస్తున్నారు.

అతను ఓ ప్రముఖ సంస్థలో ఉత్పత్తి విభాగానికి అధిపతి.

"వీడు చిన్నప్పుడు 'నిద్రో...నిద్రో' అని గోల పెట్టేవాడు. ఉదయం ఎనిమిది గంటలవరకూ నిద్ర లేచేవాడుకాదు. కానీ ఇప్పుడు చూస్తుంటే నాకు చాలా ఆశ్చర్యంగా ఉంది. హాస్పిటల్‌లో వున్నాళ్లు దాదాపుగా నైట్ అవుట్లు చేసాడు. రాత్రివేళ నాన్నగారిని నేను చూసుకుంటాను. మీరు రెస్టు తీసుకోండి అన్నాడు'' అంది పెద్ద చెల్లెలు.

"అవును. ఫ్యాక్టరీలో కూడా వీడి స్టయిలే వేరు. నా స్నేహితురాలి తమ్ముడు వీళ్ల ఫ్యాక్టరీలోనే పని చేస్తున్నాడు. వాడి ద్వారా వీడి లీలలన్నీ తెలుస్తాయిలే'' నవ్వుతూ చెప్పింది చిన్న చెల్లెలు.

"వీడు మేనేజర్‌కదా. ప్లాంట్‌లో ఎంత ఎమర్జెన్సీ ఉన్నా రాత్రి తొమ్మిదిగంటల తరువాత ఫోన్ ఎత్తడట. వదినే జవాబు చెబుతుందిట 'నిద్రలో వున్నారని, లేపడానికి వీల్లేదని'. స్వయంగా జనరల్ మేనేజర్ ఫ్యాక్టరీకి పరుగుపెట్టి అత్యవసర పనులు చూసుకుంటాడట. డిపార్ట్‌మెంట్‌లో ఎవ్వరూ నైట్ షిఫ్టులో ఓవర్‌టైమ్ చేయడానికి లేదు అదనపు ఆదాయం కోసం. ఇప్పుడు డబ్బుకోసం చూసుకుంటే భవిష్యత్తులో కిడ్నీలు, లివర్ పాడై పోతాయని హెచ్చరిస్తాడట అందరికీ. ప్లాంట్‌లో ఆధునికమైన కంట్రోళ్లు ఉన్నప్పుడు కూడా ఇంతమంది జనాలు నైట్‌లో ఉంచడం ఎందుకని వాదిస్తాడట. ఆఖరికి జనరల్ మానేజర్, యూనియన్ కల్పించుకున్నా సరే వినడు. ఇక ఇంట్లో సంగతం టావా... అమ్మతో వదిన ఎన్నోసార్లు మొరపెట్టుకున్నది 'రాత్రి తొమ్మిదిగంటలకు టీవీ కట్టేయాలి, ఆరున్నరకు ముందు ఎవ్వరూ నిద్ర లేవడానికి లేదు. స్నానానికి, టిఫిన్ చేయడానికి టైమ్

చాలదు అని పిల్లలు గోల పెడుతుంటే పనులు ఎంత వేగంగా చేసుకోవాలో ఉపన్యాసాలు దంచుతాడట తెలుసా!''

"పూర్వం మనం బలయ్యేవాళ్లం. పాపం...ఇప్పుడు ఫ్యాక్టరీవాళ్లు, ఇంట్లోవాళ్లు అన్నమాట.''

"అవును... నాకు తెలీక అడుగుతాను...నిద్రంటే ఇంత పడి చచ్చేవాడివి. మరి ఈ వారంరోజులూ హాస్పిటల్‌లో నాన్నగారి దగ్గర రాత్రిళ్లు ఎలా డ్యూటీలు చేసావురా?''

వాళ్ల మాటలు వింటున్న రాఘవకు నెమ్మదిగా అన్నీ గుర్తుకొస్తున్నాయి. హాస్పిటల్‌లో వున్నప్పుడు రాత్రి ఎప్పుడు మెలకువ వచ్చినా తన బెడ్ ప్రక్కనే కూర్చుని అన్నీ చూసుకునే నర్సులు సిద్ధంగా ఉన్నా కొడుకే స్వయంగా టేబ్లెట్లు, నీళ్లు ఇవ్వడం, బాత్రూమ్‌కి తీసుకువెళ్లడం... ఇలా అన్ని విషయాలు చూసుకున్నాడు. "చెప్పరా అన్నయ్యా... కుంభకర్ణుడి తమ్ముడివి. నీకు ఇంత ఓపిక ఎక్కడినుంచి వచ్చింది?''

"నిద్రాదేవి నా జోలికి రాలేదు మరి''

"నిజమా?'' ప్రపంచంలో ఎనిమిదో వింత చూస్తున్నట్లు మొహం పెట్టింది చిన్న చెల్లెలు.

"నాన్నగారు హాస్పిటల్‌లో వున్నాన్నాళ్లూ నా మనస్సులో మెదులుతూనే వుంది... మనల్ని ఇంతవాళ్లని చేయడంలో ఆయన ఎన్ని నిద్రలేని రాత్రులు గడిపారో అని...అంతే!''

చిన్నవాడి మాటలకు అక్కడున్న వారందరి కళ్లూ చెమర్చాయి.

కొడుకు మాటలు విన్న రాఘవగారి మనస్సు ఆనందంతో ఉప్పొంగిపోయింది. బంగారంలాంటి పిల్లలను తనకిచ్చినందుకు భగవంతుడికి కృతజ్ఞతలు తెలుపుకున్నాడు.

★

